శనివారం హిమాయత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్

బీఆర్ఎస్‌కే ముదిరాజ్‌ల సంపూర్ణ మద్దతు

- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కమిటీ తీర్మానం
- మా కుల ఆత్మబంధువు ముఖ్యమంత్రి కేసీఆర్
- మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి

హిమాయత్‌నగర్, నవంబర్ 4: అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజ్‌లంతా బీఆర్ఎస్‌కే సంపూర్ణ మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్ వెల్లడించారు. ఈ మేరకు మహాసభ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశామని తెలిపారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ముదిరాజ్‌ల ఆత్మబంధువని, ముదిరాజ్‌ల సంక్షేమం, అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్న ఆయన హ్యాట్రిక్ సీఎం కావాలని కోరుతూ తీర్మానించామని చెప్పారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపునిచ్చి వివిధ పథకాలను అమలు చేసి వారి ఆర్థిక బలోపేతానికి కృషి చేసిందని కొనియాడారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్ నాయకత్వంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలను బలోపేతం చేసుకోవడంతోపాటు ఎన్నో సమస్యలను పరిష్కరించుకున్నామని వివరించారు. ఎన్నికల తర్వాత అన్ని పదవుల్లో ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్‌ల కలలు సాకారం కావాలంటే సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని, ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిచేందుకు ముదిరాజ్‌లు సంపూర్ణ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.



ఖమ్మంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ. చిత్రంలో ఎంపీ నామా, ఎమ్మెల్సీ తాతా మధు

మతి భ్రమించే తుమ్మల వ్యాఖ్యలు

- కాంగ్రెస్ నేతల కోసం ప్రత్యేక దవాఖాన నిర్మించాలె
- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఫైర్

ఖమ్మం, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'మతి భ్రమించే కాంగ్రెస్ ఖమ్మం ఎమ్మెల్యే అభ్యర్థి తుమ్మల నాగేశ్వర్‌రావు నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. నగరంలో మేం ఇసుక, మట్టి మాఫియా చేస్తున్నామని ప్రచారం చేస్తున్నారు. ఇసుక దందా చేయడానికి ఇక్కడేమైనా గోదావరి, కృష్ణా నదులు ఉన్నాయా? నగర పరిధిలో ఉన్న నది మున్నేరు. నది నిండా రాళ్లే ఉంటాయి. ఇసుక జాడే ఉండదు' అని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం సీఎం కేసీఆర్ ప్రసంగించనున్న ఎస్ఆర్‌అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలోని చిన్న స్టేజీ తొలగింపుపై రాద్ధాంతం చేస్తున్నారని, కేవలం సీఎం భద్రతా దృష్ట్యానే స్టేజీని తొలగించాల్సి వచ్చిందని చెప్పారు. సభ పూర్తయిన తర్వాత స్టేజీని దగ్గరుండి తిరిగి నిర్మిస్తామని, ఇప్పటికే కళాశాల బ్యాంకు ఖాతాలో రూ.లక్ష జమ చేశామని స్పష్టంచేశారు. ఖమ్మం నగరంలోని ఎస్ఆర్‌అండ్ బీజీఎన్ఆర్ కళాశాల ప్రజా ఆశీర్వాద సభ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశమే నాశనమైందని, ముందు ఆ విషయాన్ని తుమ్మల అర్థం చేసుకోవాలని హితవు పలికారు. ఖమ్మంలో మతి భ్రమించి మాట్లాడేవాళ్ల సంఖ్య ఎక్కువ అవుతుందని, వారి కోసం ప్రత్యేకంగా దవాఖాన నిర్మించాల్సిన అవసరం ఉన్నదని కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి చురకలంటించారు. ఈ నెల 30న ప్రజలే ఆయనకు ఓట్లతో బుద్ధి చెప్తారని అన్నారు. సీఎం సీభకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని కోరారు. ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలోనే ప్రజల మధ్యకు వస్తారని అన్నారు. వాళ్లది అధికార దాహం తప్ప ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశమే ఉండదని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి జిల్లా మంథని ఆర్‌డీవో ఆఫీసులో ఫిర్యాదు చేస్తున్న కమాన్‌పూర్ ఎంపీపీ లక్ష్మి, ఆమె భర్త రవి

పార్టీ మారాలని ప్రలోభపెడుతున్నరు

- మంథని కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, అతని సోదరుడిపై ఎంపీపీ ఫిర్యాదు

మంథని, నవంబర్ 4: మంథని కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సోదరుడు శీనుబాబు కాంగ్రెస్‌లో చేరాలని డబ్బులు ఆశ చూపుతూ ప్రలోభాలకు గురిచేస్తున్నారని పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ ఎంపీపీ రాచకొండ లక్ష్మి, ఆమె భర్త రవి ఆరోపించారు. మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, సోదరుడు శీనుబాబుపై శనివారం మంథనిలోని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసులో ఫిర్యాదు చేశామని తెలిపారు. బీఆర్ఎస్‌లో చురుగ్గా పనిచేస్తున్న తమను కాంగ్రెస్‌లో చేరాలని అక్టోబర్ 10 నుంచి ఫోన్లు చేస్తున్నారని ఆరోపించారు. శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు, కరీంనగర్‌కు చెందిన ప్రసాద్‌రెడ్డి 9000700045 నంబర్ నుంచి ఫోన్లు చేస్తూ డబ్బుల ఆశ చూపుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెసోళ్లిచ్చే తాయిళాలకు అమ్ముడుబోమని వారు తేల్చిచెప్పారు.

వృద్ధులకు ఫ్రీ కటింగ్, షేవింగ్

సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఫ్రీగా కటింగ్ చేస్తున్న కొత్వాల్ శ్రీనివాస్

- హరీశ్‌రావుపై అభిమానంతో ఉచితసేవ

సిద్దిపేట కమాన్, నవంబర్ 4: ఈసారి మంత్రి హరీశ్‌రావుకు లక్షన్నర మెజార్టీ రావాలని ఆకాంక్షిస్తూ సిద్దిపేటకు చెందిన నాయీబ్రాహ్మణుడు కొత్వాల్ శ్రీనివాస్ వృద్ధులకు ఫ్రీగా కటింగ్, షేవింగ్ చేస్తున్నాడు. నవంబర్ 2 నుంచి డిసెంబర్ 2 వరకు 50 ఏండ్లు నిండిన వృద్ధులకు ఉచిత సేవ ప్రకటించాడు. 2018లోనూ లక్షపైచిలుకు మెజార్టీ రావాలని ఫ్రీగా కటింగ్, షేవింగ్ చేశాడు. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి మంత్రి హరీశ్‌రావుపై ఉన్న ప్రేమ.. అభిమానంతో సేవలందిస్తున్నాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 'హరీశ్‌రావు అంటే నాకు ఎనలేని అభిమానం. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి మంత్రి హరీశ్‌రావుపై నా హేర్ కటింగ్ సెలూన్‌లో వృద్ధులకు ఉచితంగా కటింగ్, షేవింగ్ చేస్తున్నాను. కేసీఆర్‌నగర్ డబుల్‌బెడ్‌రూం కూరగాయల మార్కెట్ వెనకాల హరీశన్న పేరుతో హెయిర్ కటింగ్ సెలూన్ ఏర్పాటు చేసుకున్న. నవంబర్ 2 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వృద్ధులకు ఉచితంగా కటింగ్, షేవింగ్ చేస్తూ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. ఆదివారం, బుధవారం తప్ప మిగతా రోజుల్లో ఉచిత కటింగ్, షేవింగ్ చేస్తున్నా'.. అని చెప్పాడు. '2018 ఎన్నికల్లో కూడా హరీశ్‌రావుకు లక్ష పైచిలుకు మెజార్టీ రావాలని కోరుతూ వేములవాడ కమాన్ దగ్గర 75 రోజుల పాటు ఫ్రీగా కటింగ్, షేవింగ్ చేశా. నా దగ్గరకు వచ్చే ప్రతి ఒక్కరికి మన సిద్దిపేట సాధించిన అభివృద్ధి గురించి వివరిస్తూ బీఆర్ఎస్‌కు ఓటు వేద్దాం.. వేపిద్దాం.. భారీ మెజార్టీతో హరీశ్ అన్నను గెలిపిద్దాం.. అని చెబుతున్నా. కారు గుర్తుకే ఓటు వేయాలని.. హరీశ్ అన్న భారీ మెజార్టీతో గెలవాలని కోరుకుంటున్నా'.. అని చెబుతున్నాడు.

తెలంగాణలో కాంగ్రెస్ భూస్థాపితమే

- రాష్ట్రంలో ఆ పార్టీ పూర్తిగా భ్రష్టు పట్టింది
- రూ.కోట్లు తీసుకొని దొంగ సర్వేలు
- కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరం
- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

జనగామలో శనివారం మీడియాతో మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య

జనగామ, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో పూర్తిగా భ్రష్టు పట్టిపోయిన కాంగ్రెస్.. అసెంబ్లీ ఎన్నికల తర్వాత భూస్థాపితం అవుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు విద్యుత్తు సరఫరా చేస్తుంటే, 5 గంటలు సరిపోతుందంటున్న పార్టీకి ఎవరైనా ఓటేస్తారా? అని ప్రశ్నించారు. శనివారం జనగామలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్ తెలంగాణ ఎన్నికల ప్రచారంలో 5 గంటల కరెంటు అని మూర్ఖంగా మాట్లాడి వెళ్లారని, కాంగ్రెస్ నాయకులు ప్రజల వద్దకు ఏ ముఖం పెట్టుకొని వెళ్తారని ప్రశ్నించారు. దొంగ సర్వేలు చేయించుకొని బీసీలు, ముస్లిం మైనార్టీలను దక్కాల్సిన సీట్లను రూ.కోట్లకు అమ్ముకున్న కాంగ్రెస్ రాష్ట్రంలో నామరూపాల్లేకుండా పోతుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌లో బీసీలకు అడుగడుగునా అవమానాలే తప్ప, ఆ వర్గాలకు ఏ మాత్రం గౌరవం, గుర్తింపు లేదని చెప్పారు. అణగారిన వర్గాల ఓట్ల ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఇన్నేళ్లుగా లేని కులగణన అంశాన్ని లేవనెత్తుతున్నాయని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన కేవలం 3 నెలల్లోనే సమగ్ర కుటుంబ సర్వే చేయించిన ఘనుడు దేశంలో ఒక్క కేసీఆర్ మాత్రమేనని కొనియాడారు. అందుకే తెలంగాణకు కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. తాను పదవులు, అధికారం కోసం బీఆర్ఎస్‌లోకి రాలేదని.. గౌరవం ఉండాలని, బీసీలను గౌరవించే పార్టీల్లో ఉండాలనే చేరినట్టు స్పష్టంచేశారు. 55 ఏండ్ల కాంగ్రెస్ చరిత్రలో తెలంగాణ నుంచి ఆ పార్టీకి ఏనాడూ 50 సీట్లు రాలేదని, ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పరిస్థితి మరింత దిగజారిందని పేర్కొన్నారు.

దేశానికి దారిదీపం తెలంగాణ

- సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల్లో అద్భుత పురోగతి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడి

సోలాపూర్‌లోని వస్త్ర పరిశ్రమలో వస్త్రాన్ని కత్తిరిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దేశానికి దారిదీపమైందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అద్భుత పురోగతి సాధించిందని తెలిపారు. కేసీఆర్ పాలన దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నదని పేర్కొన్నారు. చేనేత కార్మికులకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం దేశంలో ఎక్కడా లేనన్ని కార్యక్రమాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. మహారాష్ట్రలో చేనేత కార్మికులు పడుతున్న బాధలు, కష్టాలు తీరాలంటే తెలంగాణ అభివృద్ధి నమూనానే ఏకైక పరిష్కారమని చెప్పారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా ఇటీవల మహారాష్ట్రలోని సోలాపూర్‌కు వెళ్లిన కవిత అక్కడి వస్త్ర పరిశ్రమలను సందర్శించారు. వాటి నిర్వాహకులతో, కార్మికులతో మాట్లాడారు. ఆ సంభాషణ వీడియోను శనివారం సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. మహారాష్ట్రలో వస్త్ర పరిశ్రమలతో పాటు ఇతర పరిశ్రమలకు నీటి కొరత, విద్యుత్తు కొరత తీవ్రంగా ఉన్నదని, విద్యుత్తు చార్జీలు కూడా చాలా ఎక్కువగా ఉన్నాయని కార్మికులు కవిత దృష్టికి తీసుకొచ్చారు. మౌలిక సదుపాయాలు కూడా సరిగ్గా లేవని చెప్పారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం వస్త్ర, చేనేత పరిశ్రమదారులు, కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వారు ప్రశంసించారు.

చేనేత పరిశ్రమకు అనేక రాయితీలు

తెలంగాణలో పవర్‌లూమ్ పరిశ్రమలకు సీఎం కేసీఆర్, టెక్స్‌టైల్‌శాఖ మంత్రి కేటీఆర్ అనేక రాయితీలు కల్పిస్తున్నారని తెలిపారు. పరిశ్రమలకు నీటి కొరత, విద్యుత్తు కొరత లేకుండా సీఎం కేసీఆర్ దూరదృష్టితో అనేక సంస్కరణలు చేపట్టారని వివరించారు. ఈ చర్యల వల్ల పరిశ్రమలు నడుపుతున్న వారికే కాకుండా కార్మికులు, ఉద్యోగులకు ఎంతో ప్రయోజనం చేకూరుతున్నదని చెప్పారు. బతుకమ్మ చీరలను రాజకీయం చేసిన కాంగ్రెస్‌కు మహిళలు కర్రుకాల్చి వాతపెడుతారని తేల్చి చెప్పారు.

నేడు మాదిగల యుద్ధభేరి మహాసభ

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఇందిరాపార్కులో ఆదివారం మాదిగల యుద్ధభేరి మహాసభను నిర్వహించనున్నట్టు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్నారని పేర్కొన్నారు. మాదిగల అభ్యున్నతికి ఈ సభలో తీర్మానాలు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ సభ మాదిగల భవిష్యత్తును మార్చేదిగా నిలుస్తుందని తెలిపారు. మాదిగల న్యాయమైన వాటా కోసం ఐక్యతను చాటుతుందని అన్నారు. ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మాదిగలు తరలివచ్చి మాదిగలు తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

జంప్ జిలానీలకు బీఎస్పీ టికెట్

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): బీఎస్పీ అభ్యర్థుల మూడో జాబితా శనివారం విడుదలైంది. ఇందులో 25 మందిని ఖరారు చేసింది. జంప్ జిలానీలకు సైతం సీట్లను కేటాయించింది. రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే సీట్లు అమ్ముకున్నారని ఆరోపణలు గుప్పించిన కాంగ్రెస్ నేత కొత్త మనోహర్‌రెడ్డికి మహేశ్వరం టికెట్‌ను ఇచ్చింది. ఇప్పటి వరకు బీఎస్పీ 87 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, మరో 32 స్థానాలకు ఖరారు చేయాల్సి ఉంది.

మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మాట్లాడుతున్న హోంశాఖ మంత్రి మహమూద్ అలీ. చిత్రంలో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డి

బీఆర్ఎస్‌తోనే మైనార్టీల అభివృద్ధి

- కేసీఆర్‌కు ముస్లింలు మద్దతుగా నిలవాలి
- కాంగ్రెస్ పాలనలో నిత్యం మత కలహాలు
- సీఎం కేసీఆర్ పాలనలో మతసామరస్యం
- ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తి రేవంత్
- నర్సాపూర్‌లో హోంమంత్రి మహమూద్ అలీ

నర్సాపూర్, నవంబర్ 4: బీఆర్ఎస్ హయాంలోనే ముస్లింల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతున్నదని హోంమంత్రి మహమూద్ అలీ చెప్పారు. ప్రాణాలను పణంగా పెట్టి తెచ్చిన తెలంగాణను ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని రంగాల్లో ముందు ఉంచుతున్నారని తెలిపారు. కేసీఆర్‌కు ముస్లింలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో హిందూ, ముస్లింల మధ్య తరుచూ గొడవలు జరిగేవని, నేడు అన్నదమ్ముల మాదిరిగా కలిసిమెలిసి ఉంటున్నారని పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబీ, వినాయక నిమజ్జనం ఒకేరోజు వస్తే ముస్లిం పెద్దలు ఆలోచించి తమ పండుగను వాయిదా వేసుకున్నారని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో మత సామరస్యం వెల్లివిరుస్తున్నదని, రాష్ట్రంలో నెలకొన్న శాంతిభద్రతలకు ఇదే నిదర్శనమని వెల్లడించారు. షాదీముబారక్‌తోపాటు ముస్లిం విద్యార్థులకు రెసిడెన్షియల్ స్కూల్స్, ముస్లిం పేద విద్యార్థులు విదేశాల్లో చదువుకోడానికి రూ.20 లక్షల సాయం, ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం ఇలా ముస్లిం మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తి అని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి, పార్టీ మైనార్టీ సెల్ సెక్రటరీ బాసిత్, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీముద్దీన్, వైస్ ఎంపీసీ వెంకటనర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

బంజారాల ద్రోహి కాంగ్రెస్

- మంత్రి సత్యవతి రాథోడ్

గోవిందరావుపేట, నవంబర్ 4: రాష్ట్రాన్ని 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ గిరిజనుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా ద్రోహం చేసిందని, మోసపూరిత హామీలకు ఆ పార్టీ కేరాఫ్ అడ్రస్ అని మంత్రి సత్యవతిరాథోడ్ విమర్శించారు. శనివారం ములుగు జిల్లా గోవిందరావుపేటలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవిందనాయక్ అధ్యక్షతన నిర్వహించిన బంజారాల ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ మాలోత్ కవితతో కలిసి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గిరిజనులు, ఆదివాసీలు, బంజారాల సమగ్రాభివృద్ధికి సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ 50 ఏండ్ల పాలనలో బంజారాలకు చేసింది శూన్యమని దుయ్యబట్టారు. కేసీఆర్ పాలనలో ములుగు జిల్లా ఏర్పాటు చేసుకొని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ములుగు నియోజకవర్గ అభ్యర్థి నాగజ్యోతిని ప్రజలు, బంజారాలు ఆదరించి అధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రి కోరారు.

హైదరాబాద్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్

బీసీలకు కాంగ్రెస్ క్షమాపణలు చెప్పాల్సిందే

- బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): టికెట్లు కేటాయించకుండా బీసీలను దారుణంగా అవమానించిన కాంగ్రెస్ పార్టీ క్షమాపణలు చెప్పాల్సిందేనని రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ డిమాండ్ చేశారు. బీసీలపై కాంగ్రెస్ తీరును నిరసిస్తూ శనివారం సంఘం కార్యాలయంలో నల్ల కండువాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోనియా, రాహుల్‌గాంధీ అగ్రవర్ణాల వారిని, దొరలను మాత్రమే దగ్గరికి పిలిపించుకుంటూ వారికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేతలకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభాలో 56శాతం ఉన్న బీసీలకు ఏఐసీసీ, సీడబ్ల్యూసీ, పీసీసీ, డీసీసీ కమిటీల్లో ప్రాధాన్యం కల్పించలేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో బీసీలకు పాతబస్తీలోని ఓడిపోయే స్థానాలు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇప్పటికైనా బీసీలకు న్యాయం చేయాలని, లేదంటే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి జగదీశ్‌గౌడ్, పూసల సంఘం నాయకులు సత్యనారాయణ, లక్ష్మయ్య, భాస్కర్‌యాదవ్, భిక్షపతి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ



3.45 కోట్ల నగదు సీజ్

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారుల తనిఖీలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు భారీ స్థాయిలో నగదు, అక్రమ మద్యం స్వాధీనం చేస్తున్నారు. శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ రూ.1.95 లక్షల నగదును సీజ్ చేయగా, ఇప్పటి వరకు రూ.3.45 కోట్లు స్వాధీనం చేసుకున్నది. పోలీస్ అథారిటీ ద్వారా రూ.46.81 కోట్ల నగదును సీజ్ చేసినట్టు ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ తెలిపారు. లా అండ్ ఆర్డర్ కింద లైసెన్స్ ఆయుధాలను 4550 సేకరించగా, సీఆర్‌పీసీ కింద 855 కేసులు నమోదయ్యాయని చెప్పారు. 1621 నాన్ బెయిలబుల్ వారంట్ నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వర్షకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	36.0°c	19.6°c
మెదక్	33.7°c	19.8°c
ఆదిలాబాద్	33.7°c	19.6°c
రంగారెడ్డి	33.7°c	19.3°c
ఖమ్మం	33.0°c	23.0°c
నిజామాబాద్	32.5 °c	22.1°c
వరంగల్	32.0°c	23.0°c
కరీంనగర్	32.0°c	22.0°c
హైదరాబాద్	31.3°c	23.2°c
మహబూబ్‌నగర్	31.0°c	23.5°c

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

ఎంటెక్ ప్రవేశాలు

కొట్టాయంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)లో ఎంటెక్ ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.

- కోర్సు: ఎంటెక్ (ఫర్ వర్కింగ్ ప్రొఫెషనల్స్)
- స్పెషలైజేషన్లు: ఏఐ అండ్ డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, సీఎస్ఈ విత్ స్పెషలైజేషన్ బిగ్ డేటా అండ్ మెషిన్ లెర్నింగ్ ఈ కోర్సు వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం నిర్వహిస్తున్నారు.
- అర్హతలు, ఎంపిక తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: నవంబర్ 17
- వెబ్‌సైట్: https://www.mtech.iiitkottayam.ac.in

రిహాబిలిటేషన్ ట్రయినింగ్‌లో...

కటక్‌లోని స్వామి వివేకానంద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిహాబిలిటేషన్ ట్రయినింగ్ అండ్ రీసెర్చ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 22
- పోస్టులు: జనరల్ డ్యూటీ/మెడికల్ ఆఫీసర్, నర్సింగ్ సిస్టర్, స్టాఫ్ నర్స్, జూనియర్ స్టోర్ కీపర్, కుక్, సైకోథెరపిస్ట్, ల్యాబొరేటరీ టెక్నీషియన్, ప్లాస్టర్ టెక్నీషియన్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 14
- వెబ్‌సైట్: https://svnirtar.nic.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- బయాలజీ, పాలిటీ (గ్రూప్స్), ఐఐటీ, నీట్ ఫౌండేషన్ మ్యాథమెటిక్స్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.